క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

గంగవరం: స్థానిక సాయినగర్‌లోని ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ మల్లి కార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బెంగుళూరు వైదేహి హాస్పిటల్ వైద్య నిపుణులు ఈ శిబిరానికి హాజరై చికిత్స లందించనున్నట్లు వెల్లడించారు. క్యాన్సర్, గుండె, బీపీ, షుగర్, కిడ్నీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యలతో బాధపడుతున్న వారికి సర్జరీ అవసరం లేకుండా ఉచితంగా చికిత్సకు రెఫర్ చేస్తామని వివరించారు. అలాగే గుండెకు సంబంధించి ఎకో, ఈసీజీ, క్యాన్సర్ స్క్రీనింగ్, బీపీ లాంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. శస్త్ర చికిత్స అవసరమైన వాళ్లకి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్ పంపిణీ


లబ్ధిదారుకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్‌సీపీ నేతలు

శాంతిపురం: మండలంలోని కొలమడుగు పంచాయతీ రామాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుధాకర్(46) అనే వ్యక్తి కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4లక్షల చెక్ మంజూరైంది. శనివారం ఈక్రమంలో ఎమ్మెల్సీ భరత్, నేతలు చెక్‌ను మృతుడి భార్య ఆదిలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, నాయకులు ఆర్ఎస్ పండరి, మంజు, దేవేంద్రప్ప, రామచంద్ర, భాస్కర్‌రెడ్డి, చలపతి, గోవిందప్ప పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజ్‌ల పంపిణీ


మున్సిపల్ కార్మికులకు గ్లౌజ్‌లు అందిస్తున్న నేతలు

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దాతలందించిన గ్లౌజ్‌లను వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీ సుధా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు ఇబ్బంది లేకుండా చేతులు సురక్షితంగా ఉండేందుకు గ్లౌజ్‌లు ఉపయోగపడతాయని వివరించారు. పురపాలక పరిధిలోని 128 మంది కార్మికులకు గ్లౌజ్‌లు అందించిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

దంత సంరక్షణ తప్పనిసరి


విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యులు

కుప్పంరూరల్: పిల్లలు దంతాలను సంరక్షించుకోవడం తప్పనిసరని కేసీ ఆస్పత్రి అధినేత మంజునాథ్, డాక్టర్ భవ్య తెలిపారు. శనివారం మండలంలోని కొత్తయిండ్లు పాఠశాలలో దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏయే పదార్థాలు తింటే దంతాలు పాడవుతాయో, ఎలా రక్షించుకోవాలో వివరించారు. ఉదయం, సాయంత్రం రెండుసార్లు దంతాలను శుభ్రపరచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పేస్ట్, బ్రెష్‌లను పంపిణీ చేశారు.

ఇంటింటికీ తాగునీరు


డీవీఆర్ కండ్రిగ వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎస్ఈ విజయకుమార్

నగరి: ఇంటింటికీ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటిని అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.విజయ కుమార్ అన్నారు. శనివారం నగరి మండలంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ, ఇంకనూ ప్రారంభించని పనులను స్వయం సహాయక సంఘాలకు కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో జల సంఘాన్ని ఏర్పాటుచేసి రివాల్వింగ్ ఫండ్ అందిస్తామన్నారు. గ్రామ జల సంఘం, తమ సభ్యులతో చర్చించి, వారి గ్రామ అవసరాల దృష్ట్యా కావలసిన పైప్‌లైన్, ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేయడం వంటి పనులను కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. డీవీఆర్ కండ్రిగలో మండల నిధుల ద్వారా వేసిన బోరును పరిశీలించిన ఆయన పైప్ లైన్ పనులను చేపట్టాలని సూచించారు. మండల అసిస్టెంట్ ఇంజనీర్లు, వెలుగు ఏపీఎంల ద్వారా గ్రామ జల సంఘాన్ని త్వరితగతిన ఏర్పరచి, రివాల్వింగ్ ఫండ్ జమచేయుటకు వీలుగా ప్రతి గ్రామ జల సంఘానికి బ్యాంక్ ఖాతా ఓపెన్ చేసుకోవాలని సూచించారు. డీఈఈ యంఆర్.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరిడిమొడుగులో జగనన్న పాలవెల్లువ, ఆర్‌బీకే భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పెద్దపంజాణి : వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



అభివృద్ధి.. సంక్షేమమే అజెండా

- రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం
- అమూల్ ఒప్పందంతో పాడి పరిశ్రమకు లాభం
- ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు వందనం
- ఎమ్మెల్యే వెంకటేగౌడ

"ప్రజాసేవే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారు. అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తూ సాగును సంబరంగా తీర్చిదిద్దారు. వ్యవసాయానికి పెట్టుబడి నిధులను సైతం అందిస్తూ 'భరోసా' కల్పిస్తున్నారు. విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. అమూల్ సంస్థతో ప్రతిష్టాత్మక ఒప్పందం కుదుర్చుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. పారదర్శకంగా పాలసేకరణ కేంద్రాల ద్వారా పాడి రైతులు అదనపు ఆదాయం పొందేలా చర్యలు చేపట్టారు" అని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఉత్తమ సేవలందించిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు.


కూర్మాయిలో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి.. సంక్షేమమే అజెండాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ కొనియాడారు. శనివారం పలమనేరు మండలంలోని కరిడిమొడుగులో రైతుభరోసా కేంద్రం, జగనన్న పాలవెల్లువ కేంద్రం, కూర్మాయిలో రైతుభరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కరిడిమొడుగులో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుభరోసా ద్వారా 49 లక్షల మంది రైతులకు మేలు చేకూర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పంటకు పెట్టుబడిగా ఎప్పటికప్పుడు రైతన్నకు కష్టం రాకుండా భరోసా కల్పిస్తోందన్నారు. రైతన్నలకు ఎరువులు, పురుగుమందులు, నాణ్యమైన విత్తనాలను వారి గ్రామంలోనే అందుబాటులో ఉంచేందుకు ముఖ్యమంత్రి జగనన్న ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారన్నారు. చేనులో పంట వేసినప్పటి నుంచి ఉత్పత్తులను అమ్ముకునేదాకా ఆర్‌బీకేలు సేవలందిస్తున్నాయని వెల్లడించారు. పాడిరైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతోనే అమూల్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. దళారీల బాధ లేకుండా జగనన్న పాలసేకరణ కేంద్రాల ద్వారా లీటర్‌కు అదనంగా రూ.10 అందిస్తున్నారని వివరించారు. నిర్దేశించిన తేదీల్లో పాల బిల్లును పాడి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఉచితంగా పంట బీమాను సైతం అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. సీజన్ వారీగా ఈ-క్రాప్ బుకింగ్ చేయిస్తూ బీమీ సౌకర్యం కల్పిస్తోందని వివరించారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజను పథకాల ముసుగులో దోచుకుంటే, నేటి వైఎస్సార్‌సీపీ సర్కారులో వలంటీర్లు అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్ల సేవలను జనం గుండెల్లో గుర్తుపెట్టుకుంటున్నారనేది నిజమన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మరీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ సభ్యులు మల్లిక రంగనాథం, పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, సూపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోష్, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, వైస్ ఎంపీపీలు గజేంద్ర, జయశ్రీ బాలాజీనాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంగనాథం, సర్పంచులు చెంగమ్మ, చిట్టినాయుడు, వనితకళ, తిరుమలేష్, గోవిందుస్వామి, మునస్వామి, విజయ్, ఎంపీటీసీ సభ్యుడు విజయ్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అనిల్‌కుప్పయ్య, గోవిందు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

పెద్దపంజాణి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం పెద్దపంజాణిలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సేవామిత్ర, సేవారత్న అవార్డులతో పలువురు వలంటీర్లను సత్కరించారు. గతంలో విద్య లేక చాలా మంది సంక్షేమ పథకాలు పొందలేని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వలంటీర్లు ఇంటికే వచ్చి పథకాలు అందిస్తున్నారని వివరించారు. కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలకు తెగించి వలంటీర్లు సేవలందించారని కొనియాడారు. వలంటీర్ల మీద చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఎవరూ మర్చిపోరన్నారు. ఒకసారి వారిని దుర్భాషలాడి ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని అంటున్నారని విమర్శించారు. మాట మార్చే అలవాటు చంద్రబాబు సొంతమైతే.. ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చడం మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, మాజీ చైర్మన్ శంకరప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీబాబు, అంజమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, ఏఎంసీ డైరెక్టర్ ఎర్రబల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్

పలమనేరు: డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పట్టణంలోని గ్రంథాలయం ద్వారా కుట్టి డీఎస్సీ కోచింగ్ సెంటర్‌వారు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు లైబ్రేరియన్ హేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముందుగా వచ్చిన 50మందికి ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. వివరాలకు శాఖాగ్రంథాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

అధికారాల అప్పగింతపై హర్షం


మురళీనాథ్

పలమనేరు: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఆయా పంచాయతీల అధికారాలను అప్పగిస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 11 విడుదల చేయడంపై సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి వేగవంతమవుతుందని వెల్లడించారు. అలాగే పాలనా పరమైన సౌలభ్యం ఉంటుందని వివరించారు. ఈ దిశగా చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కుప్పంలో కంటి వైద్యశిబిరం

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల లో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సాయిమాత సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు శిబిరానికి హాజరై చికిత్సలందించనున్నట్లు వెల్లడించారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించి, మందులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

రొంపిచెర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓగా రెడ్డెప్పచ్చారి



రొంపిచెర్ల: మండల పరిషత్ కార్యాలయం ఏఓ రెడ్డెప్పచ్చారిని ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ కలెక్టర్ షణ్మోహన్ అదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేస్తున్న రాజేంద్రను ఈఓపీఆర్‌డీగా నియమించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి మాట్లాడుతూ అందరి సహకారంతో రాబోయే సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

సదుం: స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఈఈఎంటీ (ఎడ్యుకేషన్ ఏపీఫాని మెరిట్ లిస్ట్)లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షలో పదో తరగతి విభాగంలో లీలాధర్ మొదటి ర్యాంకు, ఏడో తరగతికి సంబంధించి మిథున్‌కుమార్ రెండో ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. సత్తా చాటిన విద్యార్థులు శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యాశాఖ కమినర్ సురేష్‌కుమార్, జేడీ సుబ్బారావు చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు వివరించారు.

రహదారి పనులకు భూమి పూజ


నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: మండలంలోని ఎస్.బండపల్లె పంచాయతీ పెసలదొడ్డి గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను ఎంపీపీ యువరాజ్ శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్లుగా మట్టి రోడ్డుతో గ్రామస్తులు నానా ఇబ్బందులు పడినట్లు వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ దృష్టికి సమస్యలు తీసుకెళితే, ఆయన వెంటనే స్పందించి సీఎండీఎఫ్ నిధుల కింద రూ.53లక్షలు మంజూరు చేయించారని వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేత రఘుపతి నాయుడు పాల్గొన్నారు.

రొంపిచెర్లకు ఐదు 'రత్న'లు


కిరణ్‌కుమారి


వరలక్ష్మి


రెడ్డిసుధా


చాంద్‌బాషా


ఇలియాజ్ బాషా

రొంపిచెర్ల: మండలంలోని ఐదుగురు గ్రామ సచివాలయ వలంటీర్లు సేవరత్న అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీఓ రాజేంద్ర తెలిపారు. శనివారం ఆయన మాట్లాలడుతూ జె.కిరణ్‌కుమారి (బొమ్మయ్యగారిపల్లె), సి.వరలక్ష్మి (గానుగచింత), చాంద్‌బాషా (బండకిందపల్లె), జి. రెడ్డిసుధా (పెద్దమల్లెల), బి.ఇలియాజ్ బాషా (రొంపిచెర్ల-2) ఎంపికైనట్లు వివరించారు. అలాగే మండలంలోని 162 మంది వలంటీర్లకు సేవమిత్ర అవార్డు అందించనున్నట్లు వెల్లడించారు.ఈ నెల 19వ తేదీన ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి చేతులు మీదుగా అవార్డుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తం.. ధ్వజారోహణం




ఆలయంలో ధ్వజరోహణం నిర్వహిస్తున్న దృశ్యం, హంసవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. శ్రీసిద్ధేశ్వర స్వామి చేనేత సాలి కులస్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో తొలుత స్వామివారికి అభిషేకం, అంకురార్పణ, కలశ స్థాపన జరిపించారు. అనంతరం మృత్సంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ చేశారు. సాయంత్రం స్వామివారిని హంసవాహనంపై కొలువుదీర్చి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు అధికార నంది వాహనంపై ఆదివారం పురవీధుల్లో విహరించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వీరభద్ర, ఈఓ కమలాకర్, సభ్యుడు హరీష్ తెలిపారు.

మాట తప్పకుండా హామీలన్నీ అమలు

శాంతిపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పకుండా అమలు చేశారని రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు 600 హామీలు గుప్పించి, చివరకు మేనిఫెస్టోనే మాయం చేశారని ఆరోపించారు. ఈ విషయం మాట్లాడకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోను అమలు చేయడం లేదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని గౌనివారి శ్రీనివాసులు, ఆయన కుటుంబీకులు చేసిన అక్రమాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని మండిపడ్డారు. టీడీపీ వెబ్‌సైట్ నుంచి అప్పట్లో వారు తొలగించిన మేనిఫెస్టో ప్రతిని కావాలంటే ఇస్తామని, దాన్ని 2019లో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో పోల్చి చూసుకోవాలని సవాల్ విసిరారు.

కోనేటిరాయుని ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు, ఆలయ సిబ్బంది

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధమైన కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. కార్యక్రమానికి పలమనేరుకు చెందిన దాతలు హరి, మీనాక్షి సహకారం అందించినట్లు వెల్లడించారు. దాతల తోడ్పాటుతో స్వామివారి కై ంకర్యాలు, కల్యాణోత్సవం, అన్నదానం వంటి విశిష్ట కార్యక్రమాలు నిత్యం చేపడుతున్నట్లు వివరించారు.

పాల సేకరణలో మోసాలకు అడ్డుకట్ట

తవణంపల్లె: పాలసేకరణ విక్రయాల్లో మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు పాల వినియోగ చట్టం-2023ను పటిష్టంగా అమలు చేయనున్నట్లు మండల మిల్క్ ఇన్‌స్పెక్టర్, పశువైద్యాధికారి లావణ్య తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ పాల సేకరణలో మోసాలకు పాల్పడినట్లు గుర్తిస్తే మిల్క్ ఎనలైజర్స్, ఇతర పరికరాలను సీజ్ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లైసెన్స్ తప్పనిసరి

మండలంలో మిల్క్ ఎనలైజర్స్ కలిగిన వారు అధికారి నుంచి మార్చి 10 లోపల తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. లైసెన్స్‌కు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. తర్వాత మిల్క్ ఇన్‌స్పెక్టర్ దగ్గర ఏటా లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.500 చెల్లించి వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకొని యూనిట్ వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.

21న చాముండేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం


విశేషాలంకరణలో అమ్మవారు

పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగశాలలో ఉన్న చాముండేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 21, 22 తేదీల్లో వైభవంగా నిర్వహించేందుకు జెట్టి కులస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారు మాట్లాడుతూ 21న స్వస్తివాచనం, గణపతిపూజ, 22న కలశారాధన, శాంతిహోమం, మహాపూర్ణాహుతితో పాటు పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చట్టాలపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి సింధు

పుంగనూరు: సమాజాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి సింధు తెలిపారు. శనివారం స్థానిక లీనార్డ్ మున్సిపల్ హైస్కూల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యా హక్కు, బాల్యవివాహాల చట్టం , పోక్సో చట్టంతో పాటు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై స్పష్టత ఉండాలని కోరారు. సమస్యలు ఎదురైనప్పుడు మానసికంగా కుంగిపోకుండా ధైర్యంగా పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని చెప్పారు. తల్లిదండ్రుల కష్టం విలువ తెలుసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. సమావేశంలో న్యాయవాది వీరమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతి, వాణిశ్రీ, శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన వీడ్కోలు


మురళిని సత్కరిస్తున్న నేతలు, అధికారులు

రామకుప్పం: డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై కర్నూలుకు బదిలీపై వెళుతున్న తహసీల్దార్ మురళికి శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి మాట్లాడుతూ, మండలంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో తహసీల్దార్ మురళి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. రైతులు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలను అందించారని కొనియాడారు. కిందిస్థాయి ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పనులను అప్పగించి సకాలంలో పూర్తిచేయించారని ప్రశంసించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీడీఓ రాధాకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.